వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు


బొమ్మనహాళ్: నేమకల్లులో పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


రాయదుర్గంటౌన్: అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు


ఉరవకొండ: ఆంజనేయస్వామికి హారతులు పడుతున్న దృశ్యం

బొమ్మనహాళ్/రాయదుర్గం/రాయదుర్గంటౌన్/గుమ్మఘట్ట: బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. నేమకల్లు అంజన్న వివిధ రకాల పండ్ల ఫలాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి, సంతోష్ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. అనంతరం హనుమద్వ్రతమ్, సుందరకాండ పట్టాభిషేక హవనం, పక్షరీ మహామంత్ర హవనం, మహాపూర్ణాముతి, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాగంణంలో స్వామి పల్లకీ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ నరసింహారెడ్డి, సర్పంచ్ పరమేశ్వర, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే డీహీరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయస్వామికి పూజలు ఘనంగా నిర్వహించారు. రాయదుర్గం పట్టణంలోని బళ్లారి రోడ్డు బొడ్డురాయి వద్ద వెలసిన ఉక్కడం వీరాంజనేయస్వామి ఆలయం, మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద అభయాంజనేయ స్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కోదండ సత్యనారాయణ, బీఎస్ ప్రసాద్, వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా గుమ్మఘట్ట మండలంలోని గొల్లపల్లి, గోనబావి, కలుగోడు, దేవరెడ్డిపల్లి, గుమ్మఘట్ట గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతిని ఆయా గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.

వైభవంగా హనుమంతుడి పల్లకీ ఉత్సవం

ఉరవకొండ/కూడేరు/వజ్రకరూరు/బెళుగుప్ప: ఉరవకొండలోని ఇంద్రానగర్‌లో ప్రసిద్ధిగాంచిన వీరాంజినేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి విశేష అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం భక్తుల నడుమ స్వామి వారి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. కూడేరు మండలంలోని కూడేరు, బసాపురం, రామదుర్గం, ముద్దలాపురంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వజ్రకరూరు మండల కేంద్రంలో కోట చెన్నకేశవ ఆంజనేయ స్వామి ఆలయంలో జయంతి వేడుకలు వైభవంగా చేపట్టారు. సాయంత్రం స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ అంగడాల క్రిష్ణయ్య, క్లర్క్ లాలేష్, అర్చకుడు వెంకటరామయ్య, భక్తులు పాల్గొన్నారు. అలాగే బెళుగుప్ప మండలంలోని బూదిగుమ్మ ఆంజనేయస్వామి, రమనేపల్లి ఆంజనేయస్వామి, బెళుగుప్ప ఆంజనేయస్వామి, తగ్గుపర్తి సీతారామంజనేయస్వామి ఆలయాల్లో జయంతి వేడుకలు చేపట్టారు. ఎర్రగుడి, దుద్దేకుంట, కోనంపల్లి, శీర్పి, గుండ్లపల్లి, నక్కలపల్లి గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పల్లకీ ఉత్సవాలను నిర్వహించారు.

కనులపండువగా ఉత్సవాలు

కుందుర్పి/కంబదూరు: కుందుర్పి మండలంలోని వడ్డెపాళ్యం గుడిబండ ఆంజనేయస్వామి, అప్పిలేపల్లి బొబ్బరకుంట ఆంజనేయస్వామి, కుందుర్పి కోట వీధి ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు కనులపండువగా చేపట్టారు. వడ్డెపాళ్యంలో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే కంబదూరు మండలంలోని కోటగుడ్డం ఆభయంజేయస్వామి ఆలయం, మల్లీశ్వరస్వామి ఆలయా సమీపంలో పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాజ్జయంతి ఘనంగా చేపట్టారు.


గుమ్మఘట్ట: గొల్లపల్లిలో పూజలు అందుకున్న ఆంజనేయస్వామి


కుందుర్పి: అలంకరణలో గుడిబండ ఆంజనేయస్వామి


కంబదూరు: పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి


కూడేరు: అలంకరణలో బసాపురం ఆంజనేయ స్వామి


వజ్రకరూరు: పూజలందుకుంటున్న కోటచెన్నకేశవ ఆంజనేయస్వామి


బెళుగుప్ప: అలంకరణలో బూదిగుమ్మ శ్రీఆంజనేయస్వామి

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోపుర కలశ ప్రతిష్ట


వేదావతి నది వద్ద గంగపూజ నిర్వహిస్తున్న గ్రామస్తులు

రాయదుర్గం రూరల్: మండలంలోని కెంచానపల్లి, కాశీపురం గ్రామాల మధ్య పోలేరమ్మ ఆలయ గోపురానికి ఆదివారం భక్తిశ్రద్ధలతో కలశ ప్రతిష్ట గావించారు. గ్రామానికి చెందిన గాజుల గోవిందప్ప కుమారుల ఆర్థిక సహకారంతో గోపుర కలశం సిద్ధం చేయించారు. గోపుర కలశ ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో బెంగళూరుకు చెందిన వేద పండితులు శాంతి హోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం చేపట్టారు. గోపుర కలశాన్ని గ్రామంలో ఊరేగించి, వేదావతి నది వద్ద గంగపూజ గావించిన అనంతరం ఆలయం వద్దకు తీసుకెళ్లి పండితుల సమక్షంలో ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గాజుల లక్ష్మీపతి, గాజుల వెంకటేశులు, అడ్వకేట్ గాజుల ఆదెన్న, గాజుల నాగభూషణ, గాజుల రామ్మూర్తి , గోపాలప్ప, సూర్య ప్రకాష్, నారాయణ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తికి అస్వస్థత

కళ్యాణదుర్గం: మండలంలోని వర్లి గ్రామ సమీపంలో పీటీఆర్‌పల్లికి చెందిన రామప్ప అనే వ్యక్తి వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామ సమీపంలో రామప్ప అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గుర్తించి, 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

ఘనంగా మాతృ దినోత్సవం


సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మహిళలు


కంబదూరు: మండలంలో మాతృ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఅండ్ఐజీ మిషన్ చర్చి మహిళలు కేక్ కట్ చేశారు.అనంతరం పాస్టర్ జేమ్స్ తల్లి ప్రేమ గురించి వివరించారు. అనంతరం తల్లులను దీవిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ప్రభాకర్, జోషఫ్‌రెడ్డి, జోయెల్, విల్సన్, జయరాజు, కుమార్, బాబు, మహిళలు పాల్గొన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం


మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రణయ్ రెడ్డి

కూడేరు: మండలంలోని మరుట్ల–2వ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శంకర్ రెడ్డి గురువారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఆదివారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్ కుమార్‌రెడ్డి మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడకండి. పార్టీ తరపున అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, బయపురెడ్డి, శ్రీనివాసులునాయుడు, నాగరాజు, నీలకంఠరెడ్డి, పరమేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దశభుజ గణపతికి పూజలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని దశభుజ గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

అభినందన


అనంతపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జేసీఎస్ డీహీరేహాళ్ మండల కన్వీనర్ ర్లాళ్ల తిమ్మారెడ్డిని అభినందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి - రాయదుర్గం

నేడు రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం


ఉంతకల్లులో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మెట్టు హనుమంతరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం వైశాఖమాసం బహుళ ఏకాదశి సందర్భంగా ఉదయం రుక్మిణీ పాండురంగస్వామికి క్షీరాభిషేకం , ప్రత్యేక పూజలు, పల్లకీ మహోత్సవం నిర్వహించిన అనంతరం స్వామి రథోత్సవం చేపడతామన్నారు. పండరీపుర పీఠాధిపతి గోపాల్‌రాజ్ ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం రథాన్ని లాగుతామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి హాజరవుతారన్నారు. పండరీపుర పీఠాధిపతి గోపాల్‌రాజ్ చేతుల మీదుగా భక్తులు పాండురంగస్వామి మాలధారణ వేసుకోవచ్చన్నారు. రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే నూతన అన్న సత్ర భవనాన్ని ప్రారంభిస్తామన్నారు.

'స్పందన'కు అధికారులు హాజరు కావాలి

కళ్యాణదుర్గం: ప్రతి సోమవారం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆర్డీఓ నిశాంత్ రెడ్డి సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరు అధికారులు ×స్పందన౯కు మొక్కుబడిగా హాజరవుతున్నారన్నారు. మరికొందరు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. ఇలాంటి వారు తీరు మార్చుకోకపోతే శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం రూరల్: మండలంలో ఉన్న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి సూచించారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో విడుదల చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9030260294, 9738404413, 9398617197 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట


అలంకరణలో అమ్మవారు

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఉంచి బాలికలు హారతులు పట్టగా మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. వేదపండితులు ముత్యాలమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్గించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న భజన పోటీలు

గార్లదిన్నె: ముకుందాపురంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ నిర్వహించిన రాష్ట్ర స్థాయి తాళాల భజన పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో 29 భజన బృందాలు పాల్గొనగా అలంకొండకు చెందిన అన్నపూర్ణ విశ్వేశ్వర భజన మండలి, ఉయ్యాలవాడకు చెందిన మూల పెద్దమ్మ భజన మండలి, గుర్రపాడుకు చెందిన శ్రీలక్ష్మీనరసింహస్వామి భజన మండలి, శంకరాపురానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి, హళికెరకు చెందిన ఆంజనేయస్వామి భజన మండలి, పెట్నికోటకు చెందిన సీతారామాంజనేయ భక్త మండలి తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. వీరికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.16 వేలు నగదు బహుమతులు అందజేశారు. మొత్తం 21 బృందాలకు నగదు బహుమతి, మిగతా జట్లకు ప్రోత్సాహక బహుమతి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

బంజారాల సంప్రదాయాలను జాగృత పరుద్దాం


బంజారాల చరిత్ర, సంస్కృతి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం నాయకులు

బెళుగుప్ప: బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలను యువత పాటిస్తూ ఆదర్శనీయ పద్ధతులను జాగృతం చేయాలని సేవాగడ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు, బంజార సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కేశవనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని యలగలవంక తండాలో ప్రముఖ రచయిత కృష్ణానాయక్ అధ్యక్షతన పుస్తకావిష్కరణ, బంజారాల జాగృత సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయనతో పాటు కావలి ఆర్డీఓ శీనానాయక్ తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్య వల్లే జాతి మనుగడ సాధ్యమన్నారు. ఈ సందర్భంగా బంజారాల ఆరాధ్యదైవాలు సత్తిమాత, రంకీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ రచయిత బంజారాల చరిత్ర, సంస్కృతి, వివాహాలు, పండుగలు పద్ధతులపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభాబాయి, ఆడిటర్ రాజునాయక్, వైద్యాధికారి గంగాదర్‌నాయక్, బంజారా నాయకులు సుబ్రమణ్యంనాయక్, బాలాజీనాయక్, తులసీనాయక్, బాలూనాయక్, మంగనాయక్, డావోనాయక్, టీచర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం


రోగులతో మాట్లాడుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి

గుమ్మఘట్ట: సర్వేంద్రియాల్లో కళ్లు ప్రధానమైనవని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్, రూరల్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో శాంతిరాం ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని రోగులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని , వైద్యులు తెలిపిన విషయాలను పాటించాలని సూచించారు. అవసరమైన వారికి కళ్ల అద్దాలను ఉచితంగా అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి చొరవతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. 70 మందిని పరీక్షించగా 53 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించామని కంటి వైద్యుడు సురేష్ తెలిపారు. ఆపరేషన్ల నిమిత్తం రోగులను నంద్యాల శాంతిరాం ఆస్పత్రికి బస్సులో తరలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మంజునాథ, మాజీ సర్పంచ్ చిత్రశేఖరప్ప, నాయకులు ఖాజాహుస్సేన్, అనంతరెడ్డి, నారాయణరెడ్డి ,ఇండియన్‌రెడ్ క్రాస్‌సొసైటీ సభ్యుడు ఈరన్న, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1.87 కోట్లతో హైస్కూల్ భవన నిర్మాణం


నిర్మాణంలో ఉన్న కొర్రకోడు హైస్కూల్ భవనం

కూడేరు: మండలంలోని కొర్రకోడులో నాడు–నేడు కార్యక్రమం కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి రూ.1.87 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం భవన నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. తొమ్మిది తరగతి గదులు, కిచెన్, టాయిలెట్స్, ప్రహరీని ఈ నిధులతో నిర్మాణం చేపడుతున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. హైస్కూల్‌లో సుమారు 250 మంది విద్యార్థులు న్నారు. ఉన్న ఐదు గదులు ఇరుకుగా ఉండడంతో పాటు దెబ్బతినడంతో పిల్లలు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడేవారు. నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ నాణ్యతలో ఎక్కడా రాజీ పడలేదని స్కూల్ కమిటీ చైర్మన్ పెద్దక్క, వైస్ చైర్మన్ గోపాల్, సర్పంచ్ చంద్రశేఖర్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు శివలాల్ రెడ్డి అన్నారు. ఆగస్టు నెలాఖరుకి నిర్మాణపు పనులు పూర్తతాయన్నారు. నూతన భవనం ప్రారంభిస్తే విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉండవన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలి

కూడేరు: పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని ..విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుని ముందుకు సాగితే అన్ని రంగాల్లో రాణించవచ్చని గ్రంథాలయాధికారిణి రాధారాణి తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్యాన్స్, పాటలపై శిక్షణ ఇచ్చారు. అంత్యాక్షరి పోటీ నిర్వహించి పిల్లల్లోని ప్రతిభను వెలికి తీశారు. కార్యక్రమంలో సిబ్బంది రంగయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

కుందుర్పి: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో రక్తహీనతను నిర్మూలించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, గ్రంథాలయ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది రామచంద్రప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఖత్నా కార్యక్రమం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జామియా అన్వారుల్ ఉలూమ్ మదరసాలో అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ఉచిత ఖత్నా(వడుగుల) కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ తెలిపారు. ఇప్పటి దాకా పేద కుటుంబాలకు చెందిన దాదాపు 160 మంది పిల్లల పేర్లు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి లడ్డు మొహమ్మద్ షఫీ, సహాయ కార్యదర్శి హుజేఫా, కోశాధికారి అహ్మద్ హుస్సేన్, కమిటీ సభ్యులు డ్రైవర్ బాషా, ఖాసీం, ఉమ్రలీ, రజాక్, షేక్ జాకీర్, షాకీర్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన ఆదివారం అనంతపురం రోడ్డులో చోటు చేసుకుంది. కళ్యాణదుర్గం డిపోనకు చెందిన హైర్ బస్సు డ్రైవర్ బస్టాండ్ నుంచి టీ సర్కిల్ మీదుగా సాయిబాబా గుడి వద్దకు అతివేగంతో వచ్చాడు. బస్సు ముందు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారులు సైతం బెంబేలెత్తారు. వేగాన్ని అదుపు చేయలేక పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద బస్సు ఆపి డ్రైవర్ పరారయ్యాడు. బస్సులో కండక్టర్ చంద్రికతో పాటు ఓ బాలుడికి గాయాలయ్యాయి. ఆర్టీసీ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మరో డ్రైవర్ ద్వారా బస్సును బస్టాండ్‌కు తరలించి, ప్రయాణికులను మరో బస్సులో పంపించివేశారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కంబదూరు: మండలంలోని కొత్తమిద్దెల, దేవేంద్రపురం గ్రామాల్లో సోమవారం సాయంత్రం 4 గంటలకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని చెర్లోపల్లిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలోగడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వా మి ఆదివారం తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు పార్టీ అనుబంధ, ముఖ్య నాయకులంతా హాజరై విజయవంతం చేయాలన్నారు.

శుభకార్యం

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు,కె.పి.దొడ్డి, గుమ్మఘట్ట, భూపసముద్రం, గ్రామాల్లో జరిగిన పలు శుభకార్యాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతీ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మంజునాథ, సర్పంచులు అనిల్, రమేష్, నాయకులు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి వీరారెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని హనిమరెడ్డిపల్లికి చెందిన పార్టీ సచివాలయ కన్వీనర్ గోపాల్ స్వగృహంలో ఆదివారం కుమార్తై, వలంటీర్ హరిప్రియ–అశోక్‌ల వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న పాల్గొన్నారు. అలాగే నరసాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆంజనేయులు కుమారుడు నరేష్- కావేరి వివాహ వేడుకలోనూ వారు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

నేటి నుంచి డ్రైవింగ్ శిక్షణ

కుందుర్పి: స్థానిక ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా 16 మంది నిరుద్యోగ యువకులను శిక్షణకు ఎంపిక చేశామని, సోమవారం జిల్లా కేంద్రంలో శిక్షణ ప్రారంభిస్తామన్నారు. అక్కడ 15 రోజుల శిక్షణ అనంతరం జూన్ 1 నుంచి కుందుర్పిలో ఫోర్ వీలర్ డ్రైవింగ్‌లో శిక్షణ ఉంటుందన్నారు.

కళామందిర నిర్మాణానికి భూమిపూజ

శెట్టూరు: మండలంలోని ముచ్చర్లపల్లిలో భగీరథ మహర్షి కళామందిర నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆదివారం గ్రామంలోని ఉప్పరకుల పెద్దల ఆధ్వర్యంలో వారి ఆరాధ్య దైవం భగీరథ మహర్షి కళామందిరం ఏర్పాటుకు సంకల్పించారు. సొంత స్థలంలో ఉప్పర కులస్థులందరూ కలసి కళామందిరం నిర్మించుకుంటున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పర సంఘం నాయకులు నవీన్, మారుతి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కూడేరు: వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నప్ప యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల వర్షాలకు ఉద్యాన పంటలు అరటి, మామిడి, చీనీ, వరి, జొన్న, కొర్ర వంటి పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి అధికారుల చేత పంట నష్టాన్ని అంచనా వేయించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, సీపీఐ నాయకులు మల్లికార్జున, రమణ, నారాయణమ్మ, మనోహర తదితరులు పాల్గొన్నారు.

17,18 తేదీల్లో బైబిల్ శిబిరం

రాయదుర్గంటౌన్: చిన్న పిల్లలకు బైబిల్ బోధనలతోపాటు క్రమశిక్షణ, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేందుకు రాజీవ్ గాంధీ కాలనీలోని కేఎస్ క్రైస్ట్ చర్చిలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించే సమ్మర్ బైబిల్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కిడ్స్ సమ్మర్ బైబిల్ శిబిరం పోస్టర్లను ఆదివారం చర్చిలో ఆయనతోపాటు చర్చి సభ్యులు విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతపురానికి చెందిన చిల్డ్రన్ ఇవాలంజిలిసం ఫెలోషిప్ సహకారంతో ఈ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రెండు రోజుల పాటు జరిగే కిడ్స్ సమ్మర్ బైబిల్ శిబిరానికి పంపించాలని కోరారు. శిబిరంలో బైబిల్ మిషనరీ పాఠాలు, పాటలు, పప్పెట్ షో, కొరియోగ్రాఫీ, స్కిట్స్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.